క్లుప్తంగా

కంటివైద్య శిబిరం



కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్‌క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో నేత్ర వైద్యుడు భాస్కర్‌గౌడ్ మొత్తం 50మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి పాలమూరు జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచందర్ యాదవ్, కో–శాధికారి మహేష్‌గౌడ్, వెంకట్రాములు, వెన్న శేఖర్ పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



మరికల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం మాజీ సర్పంచ్ గోవర్ధన్ బహుమతులను అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, నోట్‌పుస్తకాలు తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మి, చైతన్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆంజనేయస్వామి ఉత్సవాలు



మరికల్: మండలంలోని కిష్టంపల్లి ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు గురువారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకుగాను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ఎలిగండ్లలో చెన్నకేశవ, ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఉంటాయని ఆ గ్రామాల ఆలయ నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మక్తల్: పట్టణంలోని కుమ్మరివాడలో డెంగీ కేసు నమోదైనట్లు ప్రోగ్రామ్ అధికారి రాఘవేందర్ తెలిపారు. గురువారం డీఎంహెచ్‌ఓ ఆదేశాలమేరకు వైద్య సిబ్బందితో ఆయా గ్రామాలకు వెళ్లి డెంగీతో బాధపడుతున్న వారిని పరీక్షించి వైద్య సేవలు అందించారు. అదేవిధంగా డెంగీ సోకిన ఇంటి పరిసరాల చుట్టూ 50 ఇళ్ల పరిసర ప్రాంతాలను స్ప్రే చేయించారు. సందర్శించిన వారిలో కమిషనర్ భోగేశ్వర్, డాక్టర్ విరోజా, డా తిరుపతి, శ్రీధర్, ఏఎన్‌ఎం సుజాత ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

మాగనూర్: బీఎస్పీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐ పి.అశోక్‌బాబుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొప్పలి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు సుతారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి

ఊట్కూరు: మండలంలోని వల్లంపల్లి రోడ్డుకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ వెంకటరాములు, గ్రామస్తులు రాజు, వెంకటప్ప కోరారు. గ్రామం నుంచి జిల్లా కేంద్రం నారాయణపేటకు మూడు కిలోమీటర్ల దూరం ఉందని వర్షాకాలంలో మట్టిరోడ్డు గుంతలమయంగా మారిందని తెలిపారు. ద్విచక్రవాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.



రైతన్నలకు ధీమా ఏది?

- పీఎంఎఫ్‌బీవై పథకానికి మంగళం
- ప్రీమియం చెల్లింపు నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- అధిక వర్షాలతో పంటలకు నష్టం
- ఆందోళనలో రైతులు



మాగనూర్ సమీపంలో నీట మునిగిన వరి పంట (ఫైల్)

మాగనూర్: ఆరుగాలం కష్టపడి రైతులు సాగుచేసే పంటలు చేతికొచ్చే వరకు నమ్మకం ఉండదు. భారీవర్షాలు, ఈదురుగాలులు తదితర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలు నష్టం వాటిల్లితే రైతులకు పరిహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం.. మిగతాది రైతులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పంట నష్టపోయినప్పుడు బాధిత రైతులు పరిహారం పొందేవారు.

నాలుగు సంవత్సరాల నుంచి..

పీఎంబీవై కిందపంట సాగు ప్రారంభంలో బీమా చేస్తే నష్టం వాటిల్లినపుడు అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి అంచనాలు వేసి బాధితులకు బీమా అందేలా చేసేవారు. నాలుగు సంవత్సరాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నీరుగారుతోంది.

మండలంలో ఇలా..

మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎకరాల్లో పత్తి, వరి, కంది, పెసర, మినుము పంట సాగు చేశారు. ప్రభుత్వం నియంత్రిత్వ పంటలసాగు విధానం అమలులోకి తీసుకురావడంతో పత్తి పంట, వేరుశనగ పంటలకు ప్రాధాన్యత ఇచ్చారు. గత సంవత్సరం మండలంలో పత్తితోపాటుగా వేరుశనగ పంటను ప్రధాన పంటగా సాగుచేశారు. గతంలో గ్రామ యూనిట్‌గా బీమా పథకాన్ని వర్తింపజేశారు. ఎకరాకు రూ.500 చొప్పున ప్రీమియం తమ ఆధార్, పట్టా పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా నంబర్‌లతో ఏఈఓ లేదా రెవెన్యూ అధికారి ధృవీకరణతో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

30 శాతం మేర నష్టం..

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి, వరి వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బీమా పథకం ఉంటే రైతులు నష్టపోకుండా ఉండేవారు. పంట నష్టాలకు బీమా మొత్తం 25శాతం వరకు సత్వరం చెల్లించే అవకాశం ఉండేది. కాని ఈ సారి ఫసల్‌బీమా ప్రస్తావనే లేకపోవడం రైతులకు కలవరపెడుతోంది. ప్రారంభంలో ఫసల్ బీమా పథకంలో చేరే రైతుల ప్రీమియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏటా 90శాతం వరకు చెల్లించేవి. కాని ప్రభుత్వాలు ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పథకానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్‌బీవై పథకాన్ని నిలిపివేయడంతో భారీ వర్షాల కారణంగా తీవ్రంగా పంట నష్టం వాటిల్లిన ప్రభుత్వాల నుంచి సాయం అందడం లేదు. నిలిపివేసిన పథకాన్ని మళ్లీ ప్రారంభించి రైతుల ఇబ్బందులు తొలగించాలి. - మురళి, రైతు మాగనూర్

ఆదేశాలు రాలేదు..



ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం విషయంలో అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే బాధిత రైతులకు పరిహారం అందేది. గత రెండు సంవత్సరాల నుంచి బీమా నిలిపివేశారు. కేంద్రం 25శాతం, రాష్ట్రం 25శాతం, రైతు 50శాతం ప్రీమియం చెల్లించేవారు. కాని పథకం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుకోవడంతో రైతులకు ఆధారం లేకుండా పోయింది. - సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ, మాగనూర్

ఆంక్షలు లేని రుణమాఫీ కావాలి



మక్తల్‌లో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఆంక్షలు లేని రూ. 2 లక్షల రుణమాఫీ కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అంతర్రాష్ట్ర రహదారిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులకు సంపూర్ణ రుణమాఫీచేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ మేరకు.. ధర్నాలో కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ...రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, అందరికీ రుణమాఫీచేస్తామని ఇప్పుడు సగం మంది రైతులకు అందించలేదన్నారు. ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. షరతులు లేకుండా రైతులందరికి రూ. 2 లక్షల రుణమాఫీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్, రాజేష్‌గౌడ్, అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రవికుమార్‌యాదవ్, మహేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మారుతిగౌడ్, మొగులప్ప, జగ్గలిరాములు, నాగభూషణ్, శివప్ప, తరుణ్, రియాజ్, రవి, గాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, మల్లారెడ్డి, ఈశ్వర్, నేతాజీరెడ్డి, శివారెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కోస్గి: ఎన్నికల సమయంలో ఇచ్చినహామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు.. గురువారం కోస్గి శివాజీచౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొని మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ మాట్లాడారు.. రెండు లక్షల రుణమాఫీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనర్సింహులు, కౌన్సిలర్ జనార్ధన్‌రెడ్డి, కోనేరు సాయప్ప, మాజీ ఎంపీటీసీ పోషప్ప, నిరంజన్‌రెడ్డి, మోహన్‌గౌడ్, మాదవరెడ్డి, ఉసేనప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: రైతులకు బేషరతుగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు, రాస్తారోకో చేపట్టారు. స్థానిక అతిథిగృహం నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్, మధుసూదన్‌రెడ్డి, సలీం, జగదీశ్వర్, చంద్రశేఖర్, శివకుమార్, బాల్‌రెడ్డి, రాములు, మహిపాల్‌గౌడ్ పాల్గొన్నారు.



మద్దూరులో..



కోస్గిలో

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మురహర్‌దొడ్డిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ జానయ్య

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్, మురహర్‌దొడ్డి గ్రామాల్లో నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ జానయ్య హాజరై మొక్కలు నాటారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాలలో, ఇంటి ఎదుట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉజ్జెల్లిలో..

మాగనూర్: మండల కేంద్రంలోని ఉజ్జెల్లిలో గురువారం నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి వెంకట్రాములు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటి వాటిని బతికించాలని, అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



నారాయణపేట: కొత్త ఆర్‌ఓఆర్ చట్టం మీద రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులు ప్రముఖులతో జరిగిన అభిప్రాయ సేకరణ సందర్భంగా గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతిపత్రాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు అందజేశారు. ఈ మేరకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ మాట్లాడుతూ.. గతంలో ధరణిలో జరిగిన పొరపాట్లతో చాలామంది రైతులు తహసీల్దార్ కార్యాలయల చుట్టూ, కలెక్టర్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారన్నారు. ఇప్పటి ప్రభుత్వమైన కొత్త ఆర్‌ఓఆర్ చట్టంలో పరిష్కరించాలన్నారు. ఒక ప్రత్యేక నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. వినతి అందించిన వారిలో నాయకులు శివకుమార్, నర్సింహ, వెంకటప్ప ఉన్నారు.

మహిళల రక్షణకు షీటీం

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికల రక్షణకు షీ టీం పనిచేస్తున్నాయని పోలీసులు బాలరాజు, నసీనా అన్నారు. గురువారం పట్టణంలోని గురుకుల పాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా సైబర్‌నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బరోసాకేంద్రం సభ్యులు, పాఠశాల టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం



ధన్వాడ: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తహసీల్దార్ సింధూజ తెలిపారు. గురువారం ధన్వాడ కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖస్తు చేసుకున్న ఫ్లాట్‌యజమాని ఫొటో, ఫ్లాట్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేశారు. మండలంలో మొత్తం 292దరఖాస్తులు చేసుకోగా ధన్వాడలో 262మంది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చినట్లు తెలిపారు. ఎల్–1 కేడర్‌లో పంచాయతీ కార్యదర్శి, ఇరిగేషన్ ఏఈ, రెవెన్యూ ఆర్‌ఐలను బృందంగా ఏర్పాటు చేశారు. వీరు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న యజమాని భూమి వివరాలకు ప్లాట్ వద్దకు వెళ్లి అక్కడ లోకేషన్‌లో జీపీఆర్‌ఎస్ ప్రకారం ఫ్లాట్ ఫొటోతీసి ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

నారాయణపేట రూరల్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు జిల్లా నుంచి పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కోటకొండలో ఆయన మాట్లాడుతూ.. అర్హులకు రేషన్‌కార్డు, ఇళ్లలేని నిరుపేదలకు గృహ నిర్మాణానికి రూ. 10లక్షలు అందించాలని కోరారు. కెంచే నారాయణ, సలీం, నజీర్ పాల్గొన్నారు.

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ.. గురువారం హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మండలం నుంచి పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. కిరణ్, భగవంతు, భాస్కర్, మహిమూద్, వెంకటేష్, అజయ్, గోవిందు, పవన్, అంజప్ప పాల్గొన్నారు.



కోటకొండ నుంచి..

మట్టి వినాయకులను పూజించండి

అమరచింత: వినాయక చవితిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని సీఐ శివకుమార్ అన్నారు. వినాయక మండపాల నిర్వహణ కమిటీ సభ్యులతో గురువారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక మండపం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళ మండపం వద్ద కాపలాగా ఒక వ్యక్తి ఉండాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



మక్తల్: మండలంలో బుధవారం తపస్ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. గురువారం మండలంలోని మక్తల్, గుడిగండ్ల, కాట్రేవ్‌పల్లి తదితర పాఠశాలలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏ, నూతన పీఆర్‌సీ అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వెంకట్‌రాములు, నాగర్జున, నర్సిరెడ్డి, రామాంజనేయులు, రాజగోపాల్, శ్రీదేవి, రాము, నరేష్, మమత, ప్రసన్న, సుహాసిని, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూర్: రుణమాఫీకి అర్హత ఉండి మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 9,359 మంది రైతులకు గాను రూ.88.62 కోట్లు రుణమాఫీ అయ్యిందన్నారు. రుణమాఫీ కాని 220 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసున మోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు గురువారం తెలిపారు. మక్తల్ మండలం దాసర్‌దొడ్డి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను మల్లెపల్లి శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకొని స్థానిక స్టేషన్‌కు తరలించారు. గుడిగండ్ల గ్రామానికి చెందిన టిప్పర్ యజమాని రామకృష్ణ, గున్‌మకుల గ్రామానికి చెందిన డ్రైవర్ యాకూబ్‌పై కేసులు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

దాసర్‌దొడ్డి వాగు నుంచి..

మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం మక్తల్ సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లికి చెందిన టిప్పర్ డ్రైవర్ నరేష్, పెద్దజట్రంకు చెందిన టిప్పర్ డ్రైవర్ ఆనంద్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్య పెంచాలి..

నారాయణపేట: మున్సిపాలిటీలో జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్యను పెంచాలని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌లకు ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు బాల్‌రాజ్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పురపాలకలో 24, 34వార్డులు గా పెంచేందుకు సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. 2025 జనవరి నాటికి వచ్చే మున్సిపల్ ఎన్నికలకు వార్డుల సంఖ్యను పెంచాలని కోరారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్

కోస్గి: గతంలో అధికారంలో ఉండి దశల వారిగా లక్ష రూపాయల రుణ మాఫీ చేస్తామని చేతగాక చేతులేత్తిసిన బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చిన మాటమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 80శాతం రైతు రుణమాఫీ చేసిన కేటీఆర్ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలున్నాయని, అర్హులకు పంట రుణాలు రూ. 2లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే కేటీఆర్ మాత్రం కేవలం 40శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని, అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. మిగిలిన రైతుల కోసం మండలానికి ఓ నోడల్ అధికారిని నియమించి వివరాలు సేకరిస్తున్నారని, త్వరలోనే వందశాతం రుణాలు మాఫీ చేస్తామన్నారు. మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు ఇద్రీస్, భానునాయక్, మాస్టర్ శ్రీను, బాలేష్, నాయకులు నాగులపల్లి నరేందర్, టెంట్ నర్సింహ, సలీం, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బ్యాంకుల వద్ద తగ్గని రద్దీ



అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రుణమాఫీ వివరాలను తెలుసుకునేందుకు వచ్చిన రైతులతో కిటకిటలాడింది. గురువారం నర్వ, అమరచింత మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మేనేజర్ శివశంకర్ పోలీసుల సహకారంలో రైతులకు సేవలను అందించారు. బ్యాంకు ప్రధాన ద్వారం మూసి రైతులను క్యూలైన్ ద్వారా ఒకొక్కరిని లోపలికి అనుమతించడంతో రైతులు గంటల తరబడి నిల్చొనే పరిస్థితులు ఏర్పడ్డాయి.